
# తెలుసుకోవాలండీ!

పాలకోడేటి కృష్ణమూర్తి

''ఎప్పుడూ ఆఫీసు గొడవేలేనా ఇంటి విషయాలేమైనా పట్టించుకు నేదుందా?'' అని అంది శ్రీమతి ఓ రోజు పొద్దున్నే

''ఏంటో చెప్పు'' అన్నాను ఆశ్చర్యంగా.




''ఇంకా ఏంటి అంటారేమిటి? మన అబ్బాయి సంగతే. నిన్న పక్కింటి అబ్బాయిని కూడా స్కూల్లో చేర్పించేశారు. మరి మన బంటీ సంగతేమిటీ? వాడిని స్కూల్లో వేయొద్దా?''

''వాడికి ఏమంత వయస్సు మించిపోయిందని ఇంకా కొంత కాలం ఆటపాటలతో గడిపి పెద్దగా అవ్వనీ.. అప్పుడు చూద్దాం''

అదేంటీ అలా మాట్లాడతారు. వచ్చే నెలకి మూడు సంవత్సరాలు నిండుతాయి. స్కూల్లో వేసే వయస్సే అది. ఇప్పుడు స్కూలుకి పంపడం అశ్రద్ధ చేస్తే పిల్లాడు చదువులో వెనకబడిపోతాడు. మీకే మాత్రం తెలియకపోతే ఎలా?'' అంటూ విసుక్కుంది మా ఆవిడ.

''అది కాదే వాడికి బ్యాగ్ పట్టుకోవడమే సరిగా చేతకాదు. ఇప్పట్నించీ ఆ బరువులు మోయించకపోతే ఏం? ఇంకొన్నాళ్లు పోనీ చూద్దాం'' అన్నాను.

''అదేం కుదరదు. మీరు ఈ రోజు రెండు మూడు స్కూళ్ల నుంచి అప్లికేషన్ ఫారాలు తీసుకురండి'' అంది.

''మరీ ఇంత చిన్న వయసులోనే పిల్లల్ని ఆటలకు దూరం చేసి స్కూలు చదువులంటూ వెంటపడడం మంచిది కాదేమో ఇంకొన్నాళ్లు పోనీ చూద్దాం'' అన్నాను మళ్లీ.

''అలాగయితే ఇహ వాణ్ణి స్కూల్‌కి పంపినట్లే. మంచి స్కూల్లో సీటు దొరకడం మాత్రం అంత తేలిక నుకుంటున్నారా? ఇప్పటి నుంచే ప్రయత్నం చేయక పోతే ఆఖరికి గవర్నమెంటు స్కూల్లో చేర్పించాల్సి వస్తుంది. మీతో వాదనెందుకు? అప్లికేషన్ ఫారాలు మీరు తీసుకువస్తారా? నన్ను తెచ్చుకోమంటారా?'' బెదిరింపు ధోరణిలో అంది నా శ్రీమతి.

''పిల్లలు ప్రతిభావంతులైతే ప్రత్యేకమైన స్కూళ్లే అక్కర్లేదు. కాకపోతే వారి టాలెంట్‌ను గుర్తించి కనీస సదుపాయాలు కల్పించడం తల్లిదండ్రులుగా మన విధి. మరో విషయం... ఖరీదైన స్కూళ్లలో చదివి నంత మాత్రాన గొప్పవాళ్లయిపోరు. మన దేశంలో ప్రముఖులందరూ వీధి దీపాల కింద చదువుకున్నవాళ్లే.'' అంటూ విషయాన్ని పక్కదోవ పట్టిద్దామని ప్రయత్నించాను. అయినా నా ప్రయత్నాలేవీ ఫలించ లేదు. చివరకు మా ఆవిడ చెప్పినట్లే స్కూళ్ల వెంట పడ్డాను. ఎలాగయితేనేమి కష్టపడి డబ్బునష్టపడి ఓ రెండు స్కూళ్ల నుంచి అప్లికేషన్ ఫారాలు తీసుకొచ్చాను. ఫారాలు చాలా పెద్దవిగా వున్నాయి. అందులో ఎన్నో వివరాలతో పాటు రకరకాల ప్రశ్నలు వున్నాయి.

''పిల్లాడు ఎప్పుడు పుట్టాడు? డెలివరీ ఎలాగయ్యింది? సిజేరియనా? నార్మలా? పుట్టినప్పుడు బిడ్డ బరువెంత? ఇప్పుడు బరువెంత? పొడుగెంత?అపుడెంత? ఇప్పుడెంత? నిద్రలో పక్క తడుపుతాడా? నిక్కరు తొడుక్కోవడం వచ్చా? బటన్స్ పెట్టుకోగలడా?షూస్ లేసులు కట్టుకోగలడా?జీర్ణవ్యవస్థలో లోపాలేమైనా వున్నాయా? తిండి తినే విషయంలో పెంకితనం చేస్తాడా? హార్లిక్స్, బూస్ట్‌లాంటి హెల్త్ డ్రింక్స్, ఖరీదైన పదార్థాలు పెడతారా లేదా? ఇంటి చుట్టుపక్కల వాతావరణం, ఇరుగుపొరుగు పిల్లల ప్రవర్తన ఎలాగుంది? తల్లిదండ్రి ఎవరు? వాళ్లది దగ్గర సంబంధమా? దూరపు సంబంధమా? ఏం పనిచేస్తారు? వాళ్ల మధ్య సంబంధాలు ఎలా వున్నాయి? వారంలో ఎన్ని

సార్లు దెబ్బలాడుకుంటారు? మాతృభాష ఏమిటీ? ఇంట్లో ఏ భాష మాట్లాడతారు? తల్లిదండ్రులకి ఎన్ని భాషలు తెలుసు? ఇంట్లో ట్యూషన్ల వంటివేమైనా చెప్పించగలరా? స్కూల్ నుంచి ఇల్లెంత దూరం? పిల్లాడు స్కూలుకెలావస్తాడు? అతని వెంట ఎవరు వస్తారు? చీకటన్నా లేదా పిల్లి, ఎలుక, వంటి వాటిని చూసి భయపడతాడా? తల్లిదండ్రులు కోపిష్టులు ఆందోళన మనస్కులా? పిల్లాడ్ని అతి గారాబం చేస్తారా? భోజనం చేయడం, స్నానం చేయడం. స్కూల్ బ్యాగ్ సర్దడంవంటివి అతను చేసుకోగలడా?'' వంటి యక్షప్రశ్నలు లక్ష వున్నాయి వాటిలో.

వాటికి బాగా ఆలోచించి నేను మా ఆవిడ కలిసి పరస్పరం సంభాషించుకొని నాలుగైదు గంటలపాటు శ్రమపడి మొత్తానికి ఫారం నింపి స్కూల్లో ఇచ్చాం.

స్కూల్లోని గుమాస్తా అప్లికేషన్ ఫారం తీసుకోగానే స్కూల్లో సీటు వచ్చినంత సంతోషంతో ఎగిరి గంతేసింది మా ఆవిడ. కానీ ఆ సంతోషం ఎంతోసేపు నిలవ లేదు. అప్లికేషన్ ఫారం తీసుకొని రశీదు ఇస్తూ "సీటు ఇచ్చేది లేనిదీ మీకు తర్వాత తెలియపరుస్తాం'' అని చెప్పాడు గుమాస్తా.

"ఎప్పుడు తెలుస్తుంది? మాకు?'' అని అడిగాను.

"అంత తొందర పడతారేం? అప్లికేషన్ పరీక్షించిన తర్వాత మిమ్మల్ని ఇంటర్వ్యూకి పిలుస్తారు. అప్పుడు తెలుస్తుంది మీ అబ్బాయికి సీటు ఇచ్చేది లేనిది''

"మమ్మల్ని ఇంటర్వ్యూ చేస్తారా?'' అన్నాను ఆశ్చర్యపోతూ.

"అవును ఏ అబ్బాయినైనా అమ్మాయినైనా స్కూల్లో చేర్చుకునే ముందు వారితో పాటు వారి తల్లిదండ్రుల్ని కూడా ఇంటర్వ్యూ చేస్తాం. అది మా స్కూలు పాలసీ'' అన్నాడా గుమస్తా.

"అలాగా....'' అన్నాను.

"కొన్ని స్కూళ్లల్లో ఈ తతంగముంది. మన ఎదురింటావిడ చెప్పింది. ఇంటికి పదండి ఇంటర్వ్యూకి ప్రిపేరవుదాం!'' అంది మా ఆవిడ. ఆవిడ అన్నట్లుగానే ఇంటికి వెళ్లిపోయాం. అటక మీద నుంచి ఎప్పటివో మా కాలేజీ నాటి పుస్తకాలు తీసి దుమ్ము దులిపింది మా ఆవిడ. చదవండి...చదవండి అంటూ తను చదువుతూ నన్ను తొందరపెట్టింది.

రెండు మూడు వారాల తర్వాత స్కూలు నుంచి ఓ కవరు వచ్చింది. చేతులు వణుకుతుండగా ఆ కవరు విప్పి చూశాం. మా అబ్బాయికి స్కూల్లో ప్రవేశం కోసం మేం పెట్టిన అప్లికేషన్‌ని ఆమోదించినట్టు... మమ్మల్ని ఇంటర్వ్యూకి రావల్సిందిగానూ అందులో సూచించారు. మేము చాలా సంతోషించాం. మా ఆవిడైతే పరవశించిపోయింది. పిల్లాడ్ని ఎత్తుకుని ఒకటే ముద్దులు కురిపించింది.

"ఏవండీ అలస్కాలో ఆవాలు పండుతాయా లేదా?'' అంటూ అడిగింది మా ఆవిడ ఓ రోజు.

"అవన్నీ ఎందుకిప్పుడు?''అన్నాను విసుగ్గా.

"ఏమో రేపు ఇంటర్వ్యూలో ఈ ప్రశ్నే అడిగితే... అన్నీ తెలుసుకొని వుండడం మంచిది'' అంది మా ఆవిడ.

నాకూ నిజమేననిపించింది. ఇహ అప్పటి నుంచి అడ్డమైన పుస్తకాలు చదవడం మొదలుపెట్టాను మా ఆవిడతో పాటు.

పిల్లల్ని స్కూల్లో వేయడానికి ఇంటర్వ్యూకి వెళ్లడం అదివరకూ మాకు అనుభవం లేదు. ఇదే మొదటిసారి. దాంతో మా కాలనీలో వున్నవాళ్లని, వాళ్ల వాళ్ల పిల్లల్ని స్కూల్లో వేసిన అనుభవం వున్నవారిని కలిశాము. ఇంటర్వ్యూలో మేము తయారుకావడానికి వాళ్లని ఇంటర్వ్యూ చేశాం.

"ఇంటర్వ్యూ చేయడం మామూలే. నిజానికి ఇది మీ అదృష్టానికి పరీక్షలాంటిది. తల్లిదండ్రి, పిల్లాడిని ముగ్గురిని కూడా కష్టమైన ప్రశ్నలు అడుగుతారు.'' అంది మా ఎదురింటావిడ. ఆవిడకి ఈ విషయంలో చాలా అనుభవం వుంది. ఒకరూ ఇద్దరూ కాదు ముగ్గురు పిల్లల్ని స్కూల్లో చేర్పించిన అనుభవం అమెది. ఆవిడ మాటలు విని మేము భయపడ్డం గమనించి "కంగారు పడకండి.... ధైర్యంగా వుండండి. విధిని నమ్ముకోండి'' అంటూ కొంత వేదాంతం చెప్పి మాకు ధైర్యం నూరిపోసే ప్రయత్నం చేసిందావిడ.

"చూడండి. మీ మాతృ భాష మీద, సంస్కృతి మీద మీకు గౌరవం, అభి మానం, మమకారం వుండొచ్చు. కానీ ప్రపంచీ కరణ నేపథ్యంలో ఆంగ్లం అవశ్యకత బాగా పెరి గింది. ఇటువంటి పరిస్థి తుల్లో మేము కొన్ని అంక్షలు విధిస్తాం. దానికి లోబడే మీరు మీ పిల్ల వాడ్ని చదివించాల్సి వుంటుంది. అంతే కానీ ఈ రోజుల్లో కూడా తెలుగు గొప్పతనం, శత కాలు, పద్యాలు అంటూ మాట్లాడడం వెనక్కు నడ వడమే. అన్నమాట....''

ఇంటర్వ్యూలో అడగబోయే ప్రశ్నలను ఊహించుకొని వాటికి సమాధానాలు రాసుకున్నాం. ఇంటర్వ్యూకి వెళ్లేటప్పుడు ఎలాంటి దుస్తులు వేసుకోవాలి? ఎలా ముస్తాబు చేసుకోవాలి? వంటి విషయాల్లో మా ఎదురింటావిడ సలహా తీసుకొన్నాం.

నేను ఆఫీసుకి వారం రోజులు శెలవుపెట్టాను. ఇంటర్వ్యూ కోసం నేను కూడా బాగా ప్రిపేరయ్యాను. పిల్లాడ్ని ఇంగ్లీష్ మీడి యం స్కూల్లో వేస్తున్నందువల్ల మా ఆవిడ పిల్లాడికి ఇంగ్లీష్ నేర్పించసాగింది. పిల్లాడితో ఇంగ్లీష్‌లో మాట్లాడుతూ తనూ ఇంగ్లీష్ నేర్చుకోసాగింది. పేరు, తండ్రిపేరు, చిరునామా, టెలిఫోన్ నెంబరు, పుట్టినతేదీ, వగైరాలన్నీ ఇంగ్లీష్‌లో పిల్లాడికి నేర్పింది. ఇంత చేసినా ఇంటర్వ్యూలో ఏం అడుగుతారో ఏమో అన్న సందేహం వెంటాడుతూనే వుంది. ఒకవేళ ఇంటర్వ్యూలో ఒసామాబిన్‌లాడెన్ ఎక్కడన్నారు? అని అడిగితే ఏం చెప్పగలం? అంటూ దిగులు పడింది.

"ఇంతకీ లాడెన్ ఎక్కడున్నాడంటారు?'' అని నన్ను అడగింది.

నాకు మాత్రం ఏం తెలుసు? పాత పేపర్లు మ్యాగజైన్లు అన్నీ తిరగేశాను.

చివరకు ఇంటర్వ్యూ రోజు రానే వచ్చింది. మేము. స్నానాదికాలు ముగించుకొని కొత్తబట్టలు తొడుక్కుని, సెంటు రాసుకొని యధాశక్తి ముస్తాబై స్కూలుకి చేరుకున్నాం. అక్కడ ఇంకా చాలా మంది పిల్లలు వాళ్ల వాళ్ల అమ్మానాన్నలతో వచ్చి ఇంటర్వ్యూకి సిద్ధంగా కూర్చుని వున్నారు. కొంత సమయం గడిచిన తర్వాత ఇంటర్వ్యూకి పిలుపు వచ్చింది. మేము గదిలోకి వెళ్లగానే ఇంటర్వ్యూ చేసే వాళ్లకేసి చూస్తూ గుడ్‌మార్నింగ్ చెప్పాం. వాళ్లు 'వెరీ గుడ్ మార్నింగ్' అంటూ బదులు చెప్పారు. అక్కడ కూర్చున్నవారిలో ఒకావిడ మా అబ్బాయి వైపు చిరునవ్వులు చిందిస్తూ "నీకు ఇంగ్లీష్ వచ్చా?'' అని అడిగింది. వెంటనే నేను "యస్ మేడం. మీరు మా బుజ్జిగాడితో ఇంగ్లీష్‌లో మాట్లాడవచ్చు....'' అని బదులిచ్చాను.

పిల్లవాడిని ఇంగ్లీష్‌లో పేరు, తండ్రిపేరు, జన్మతిథి ఇష్టమైన తిండి గురించి అడగ్గానే అవన్నీ వాడితో అదివరకే బట్టీపట్టించాం కాబట్టీ గడగడా చెప్పేశాడు. ఆ తర్వాత ఎప్రిల్, క్యాట్ వంటి ఇంగ్లీష్ పదాలకు స్పెల్లింగ్‌లు అడిగారు.

మావాడు సునాయాసంగా చెప్పేశాడు. ఆవిడ ఒకసారి 'గుడ్' అని మరోసారి 'వెరీగుడ్' అనీ అంది పిల్లాడి ఇంటర్వ్యూ పూర్తయ్యింది. మంచి మార్కులే వచ్చాయి.

ఇహ మా వంతు వచ్చింది. మా ఆవిణ్ని, నన్ను కొన్ని ప్రశ్నలడిగారు. "మీరు పిల్లాడికి చదువు చెప్పడానికి ఎంత టైము కేటాయిస్తారు? ఎంత సేపు నిద్ర పోనిస్తారు? అంటూ అన్నింటికి సమాధానాలు చెప్పాం. ఒసామా బిన్‌లాడెన్ గురించి చెప్పలేదు కానీ కొరియా ముఖ్యమంత్రి ఎవరు? ఆయన ఎక్కడుంటారు? ఆఫ్ఘనిస్తాన్ విద్యామంత్రి ఎవరు?''వంటి ప్రశ్నలెన్నో అడిగారు. ఆ ప్రశ్నలన్నింటికి నాకు తోచిన సమాధానాలు చెప్పాను.

ఆ తర్వాత ఒకాయన నా వంక తిరిగి "మీరు అబ్బాయితో ఇంట్లో ఏ భాష మాట్లాడతారు? అని అడిగాడు.

"తెలుగులో, అదే మా మాతృభాష'' అన్నాను.

"అలా కుదరదు. అబ్బాయితో ఇంట్లో కూడా మీరు ఇంగ్లీష్‌లోనే మాట్లాడాలి'' అన్నారు.

"అదెలాగండీ? మా అబ్బాయిని మీ స్కూలు లాంటి మంచి స్కూల్‌లో చేర్పించాలని నా ఉద్దేశం. అయితే తెలుగును పూర్తిగా మర్చిపొమ్మంటే మాత్రం కుదరదు. ఎవరైనా తమ మాతృభాషను మరవగలరా?'' అన్నాను.

"చూడండి. మీ మాతృభాష మీద, సంస్కృతి మీద మీకు గౌరవం, అభిమానం, మమకారం వుండొచ్చు. కానీ ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంగ్లం ఆవశ్యకత బాగా పెరిగింది. ఇటువంటి పరిస్థితుల్లో మేము కొన్ని ఆంక్షలు విధిస్తాం. దానికి లోబడే మీరు మీ పిల్లవాడ్ని చదివించాల్సి వుంటుంది. అంతే కానీ ఈ రోజుల్లో కూడా తెలుగు గొప్పతనం, శతకాలు, పద్యాలు అంటూ మాట్లాడడం వెనక్కు నడవడమే. అన్నమాట....'' అన్నాడాయన.

నేను కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాను. ఆ తర్వాత మా అబ్బాయిని మీ స్కూలులో చేర్పించేది లేనిది నేను ఆలోచించి చెపుతాను.'' అని మా ఆవిణ్ణి, పిల్లాడిని తీసుకొని బయటకు వచ్చేశాన.

మా అబ్బాయి, మా ఆవిడ చెయి పట్టుకొని "మమ్మీ డాడీ ఏం ఆలోచిస్తారట?'' అని అడిగాడు.

"మా ఆవిడ వాడిని ఎత్తుకొని ఏ ముందీ మనం ముందుకు వెళుతున్నామా? లేక వెనక్కు వెళుతున్నామా? అని ఆలోచిస్తారేమో'' అంది.

★